## ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

మంత్రి తలసాని



నెహ్రు పార్కులోని వార్డు కార్యాలయంలో ఫిర్యాదులపై ఆరా తీస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: నియోజకవర్గ పరిధిలో కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి పనులను చేపడుతూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ డివిజన్‌లో రూ.81 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ముందుగా బస్టాండ్ సమీపంలోని ఎస్‌ఆర్ టీలో రూ.49.50 వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ లైన్, స్వామి టాకీస్ వద్ద రూ.32 లక్షలతో చేపట్టనున్న వాటర్ లైన్ పనులను ప్రారంభించారు. అనంతరం నెహ్రు పార్కులో పర్యటించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన వార్డు ఆఫీసును సందర్శించి వస్తున్న ఫిర్యాదులు, పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్కులో సీసీ కెమెరాలు, లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. గత నెలలో సనత్‌నగర్‌లోనిఅశోక్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించినప్పుడు పలు సమస్యలు తన దృష్టికి తీసుకురాగా, వెంటనే విద్యాశాఖ మంత్రిని అదే స్కూల్‌కు ఆహ్వానించిన విషయాన్ని గుర్తు చేశారు. స్కూల్ అభివృద్ధి, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పన కోసం రూ.2 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ నెల నాల్గో తేదీన విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, జోనల్ కమిషనర్ వెంకటేష్; ఈఈ ఇందిర, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, హార్టికల్చర్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ విఫలం



మెట్టుగూడలో పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేత నోముల ప్రకాశ్‌రావు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు విరివిగా చేపట్టామని చెప్పుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు పేద ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నోముల ప్రకాశ్‌రావు విమర్శించారు. శుక్రవారం మెట్టుగూడ డివిజన్‌లో వందలాది మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పాదయాత్ర నిర్వహించారు. మెట్టుగూడ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి డివిజన్ పరిధిలోని ఆలుగడ్డబావి, గోవిందపురం, మెట్టుగూడ తదితర బస్తీల్లో పాదయాత్రలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రజలకు కలిసి వారి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో నోముల ప్రకాశ్‌రావు మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని గొప్పలు చెప్పుకుంటున్న అధికార పార్టీ నాయకుల ప్రకటనల్లో వాస్తవం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎంఆర్ శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ నాయకులు సురేశ్‌లాల్, జగదీశ్వర్, ప్రవీణ్, వహీదుద్దీన్, షకీల్‌ఖాన్, రవిచంద్ర, అభిషేక్, భారతి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా...

### ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: కిలో టమాటా రూ.23, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 23, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 33, పచ్చకాకర 32, పందిరి బీర 23, క్యాబేజీ 15, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 45, గోకరకాయ 23, కీర 20, దోసకాయ 28, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 28, ఆలుగడ్డ 21, చామగడ్డ 33, మొరంగడ్డ 40, కందగడ్డ 47, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 4-6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

### ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: పెండింగ్‌లో ఉన్న రూ. 5400 కోట్ల విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిని వెంటనే విడుదల చేయాలని టీజేఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ వినోద్‌కుమార్ శుక్రవారం డిమాండ్ చేశారు. కళాశాలల్లో వివిధ కోర్సులు పూర్తి చేసిన పేద విద్యార్థులు ఫీజులు చెల్లించలేక సర్టిఫికెట్లు తీసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు.

### వికలాంగుడికి ట్రై రిక్షా, పేదవాడికి సైకిల్ వితరణ



ట్రై రిక్షా, సైకిల్‌ను అందజేస్తున్న డాక్టర్ రవీందర్ గౌడ్

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ లో ఇద్దరికి ట్రై రిక్షా, సైకిల్ శుక్రవారం పంపిణీ చేశారు. సనత్‌నగర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రవీందర్ గౌడ్ ఇటీవల డివిజన్‌లో పాదయాత్ర చేశారు. అదే సమయంలో ఓ వికలాంగుడు, మరో వ్యక్తి పరిస్థితి చూసి చలించిపోయారు. సదరు పేదవాళ్లకు ఆపన్న హస్తం అందించాలని నిర్ణయించి శుక్రవారం బన్సీలాల్ పేట్ డివిజన్‌కు చెందిన సంపత్‌కు ట్రైసైకిల్, విన్నీకి సైకిల్‌ను అందజేశారు.

### పేద విద్యార్థులకు చేయూత



అడ్డగుట్ట: ఈసీఐఎల్ లోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో చదువుతున్న ముగ్గురు పేద విద్యార్థులకు సెవెన్ రేస్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ సారతా మురుగన్ ఆర్థిక సాయం అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన కంటి చూపు లేని భాను అనే విద్యార్థితో పాటు దుర్గా, భవాని అనే విద్యార్థినులకు కాలేజీ ఫీజు చెల్లించారు.

### బొడ్రాయి పునః ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం



లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలో నాభిశిల(బొడ్రాయి) పునః ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం విఘ్నేశ్వర పూజతో వేద పండితులు ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో లాలాపేట బొడ్రాయి ఉత్సవ కమిటీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

### నిత్యావసరాల వస్తువుల పంపిణీ



ఉస్మానియా యూనివర్సిటీ: పేద వర్గాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ నాయకులు కొత్త రాకేష్ శుక్రవారం తెలిపారు. కంటోన్మెంట్ ప్రాంతంలోని వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న 150 మంది పేదలకు మానవత్వంతో రాకేష్ బృందం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు.

### ఇఫ్లూలో పూర్వ విద్యార్థుల నెట్ వర్క్

ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)లో పూర్వవిద్యార్థుల నెట్ వర్క్‌ను వీసీ ప్రొ.సురేష్ కుమార్ ప్రారంభించారు. శుక్రవారం వర్సిటీ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో సీఐఈ నుంచి ఇఫ్లూ (1958–2023) జ్ఞాపాలు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. పలువురు పూర్వవిద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ కమిటీ మెంబర్‌గా శ్రీనివాసులు గౌడ్



డాక్టర్ శ్రీనివాసులు గౌడ్‌ను సన్మానిస్తున్న నేతలు

లాలాపేట: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ కమిటీ మెంబర్‌గా తార్నాక డివిజన్ లాలాపేటకు చెందిన టీపీసీసీ సెక్రటరీ డా.ఎస్.ఎల్. శ్రీనివాసులుగౌడ్ నియమితులైనారు. ఈ మేరకు ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్ కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సికింద్రాబాద్ నియోజక వర్గం నుంచి బీసీ డిక్లరేషన్ కమిటీలో ఈయనకు స్థానం లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం తార్నాకలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే ఆస్పిరెంట్, ప్రముఖ న్యాయవాది, సోషల్ జస్టిస్ సంఘం అధ్యక్షులు నాగుల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో శ్రీనివాస్‌లు గౌడ్‌ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు.

## కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ కమిటీ సభ్యుడిగా విజయవర్ధన్ నాయుడు



సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ కమిటీ సభ్యుడిగా రాంగోపాల్‌పేట డివిజన్ సింధికాలనీకి చెందిన విజయవర్ధన్ నాయుడు నియమితులయ్యారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్ కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ ప్రకటించిన పేర్లలో విజయవర్ధన్ నాయుడికి సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి స్థానం లభించింది. తనకు కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ కమిటీ సభ్యుడిగా అవకాశం కల్పించినందుకు ఆయన రేవంత్‌రెడ్డి, మహేష్‌కుమార్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## 'పక్షపాతంగా జీహెచ్ఎంసీ అధికారులు'



మాట్లాడుతున్న టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ సంగిశెట్టి జగదీశ్వరరావు

ముషీరాబాద్: జీహెచ్ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా పనిచేస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రావు ఆరోపించారు. సదరు అధికారులపై జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో పథకాల గురించి రూపొందించిన పోస్టర్లను ముషీరాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తే వాటిని గురువారం రాత్రి జీహెచ్ఎంసీ సిబ్బంది చేత బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేసి తొలగింపజేశారన్నారు. శుక్రవారం రాంనగర్‌లో ఆయన మాట్లాడుతూ.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే వాల్‌పోస్టర్లను రూపొందించామన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలు బ్యానర్లు అనేకం ఉన్నాయని వాటిపైన చర్యలు తీసుకోని జీహెచ్ఎంసీ అధికారులు కాంగ్రెస్ పార్టీ పోస్టర్లపైన చర్యలు తీసుకోవడాన్ని ఆయన ప్రశ్నించారు. గతంలో 'కేసీఆర్ హఠావో తెలంగాణ బచావో' పోస్టర్లను కూడా చించివేశారని దీనిపై చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో కూడా కేసు రిజిస్టర్ అయిందన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ నేతలు ఎన్ని ఎత్తులు వేసిన కాంగ్రెస్ పార్టీ గెలుపును ఆపలేరని స్పష్టం చేశారు. టీపీసీసీ రాష్ట్ర నాయకులు జీ.ఎం.కేశవచారి, ఖరీం, రామకృష్ణ, అంజయ్యగౌడ్ తదితరులున్నారు.

## ఆర్మీ అధికారులకు రాఖీలు కట్టిన విద్యార్థులు





లాలాపేట: శాంతినగర్‌లోని తక్షశిలా హైస్కూల్ విద్యార్థులు ఆర్మీ అధికారులకు రాఖీలు కట్టి వేడుకలను జరుపుకున్నారు. సికింద్రాబాద్‌లోని మోతీ మహల్‌లో ఆర్మీ ఆర్డినెన్స్ విభాగాధిపతి కమాండెంట్ ఆజిత్ అశోక్ దేశ్‌పాండే, కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఏ.కె. భోస్లే,కెప్టెన్ అమర్నాథ్, ఇతర ఆర్మీ అధికారులకు విద్యార్థినీలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

**బేగంపేట టీటీఐలో రక్షాబంధన్ వేడుకలు**

సనత్‌నగర్: బేగంపేటలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ)లో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. టీటీఐ సిబ్బందితో సహకారంతో బ్రహ్మకుమారీస్ వరల్డ్ స్పిరిచ్యువల్ ఆర్గనైజేషన్ మారేడ్‌పల్లి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గీతాంజలి స్కూల్ గ్రేడ్-2 పిల్లలకు, ట్రాఫిక్ సిబ్బందికి, ట్రాఫిక్ ఉల్లంఘనులకు రాఖీలు కట్టి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు..మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, రోడ్డుపై మొబైల్స్ వాడడం వల్ల కలిగే పరిణామాలను వివరించారు. అలాగే రోడ్డు భద్రత నియమాలు, నిబంధనలపై అవగాహన కల్పించి సందేహాలను నివృత్తి చేశారు.

## హయత్‌నగర్ డిగ్రీ లెక్చరర్‌కు గిన్నిస్‌బుక్‌లో చోటు



డాక్టర్ జహీదా బేగంను అభినందిస్తున్న ఓయూ వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లెక్చరర్ డాక్టర్ జహీదా బేగంకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు లభించింది. గత నెల 28 చెన్నైలోని హోటల్ తురియాలో జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ రికార్డును అందుకున్న జహీదాబేగం శుక్రవారం వీసీ ప్రొ.రవిందర్ అభినందిచారు. ఓయూ కాలేజీల అధ్యాపకులకు ఇంత వరకు ఇలాంటి అరుదైన గుర్తింపు లభించలేదని తొలిసారి జహీదా బేగం సాధించిన ఈ రికార్డును యూజీసీ న్యాక్ గుర్తింపు కోసం పరిగణిస్తామని వీసీ పేర్కొన్నట్లు తెలిపారు. వరల్డ్-2023 గ్రంథంలో 200 ఆర్టికల్స్‌కు ఎడిటర్‌గా, మహిళ సాధికారత పై 'షీ ఫర్ హర్ సెల్ఫ్' పుస్తక రచయితగా, ఎడిటర్‌గా వ్యవహరించినందుకు గిన్నిస్ రికార్డులో చోటు లభించిన్నట్లు జహీదా బేగం వివరించారు.

## సంతోషిమాత ఆలయంలో శ్రావణ పూజలు

కంటోన్మెంట్: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్‌లోని ప్రముఖ సంతోషీమాత ఆలయానికి భక్తులు పోటెత్తారు. బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి లాస్య నందిత ఆలయ ప్రాంగణంలో స్థానిక మహిళలకు పసుపు బొట్టు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లాస్య మాట్లాడుతూ అమ్మవారి ఆశిస్సులతో కంటోన్మెంట్ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు టీఎన్ శ్రీనివాస్, నర్సింహ ముదిరాజ్, మురళి యాదవ్, వంగల మల్లేష్ పాల్గొన్నారు.

## టీఎస్-యూటీఏ ఆవిర్భావం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వర్సిటీల అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ స్టేట్ యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్ (టీఎస్-యూటీఏ) ఆవిర్భావించింది. శుక్రవారం తెలుగు యూనివర్సిటీలో జరిగిన సమావేశంలో అనేక అంశాలను చర్చించి టీఎస్‌యూటీఏను ప్రకటించారు. అధ్యక్షులుగా ఓయూ అధ్యాపకులు ప్రొ.మల్లేశం, కార్యదర్శిగా సీహెచ్.శ్రీనివాస్, ముఖ్యసలహాదారులు మల్లికార్జున్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## మెడికల్ షాపుపై డ్రగ్ అధికారుల దాడులు

- రూ.2 లక్షల విలువైన ప్రభుత్వ మందులు స్వాధీనం

సికింద్రాబాద్: ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసే మందులను విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం వారసిగూడలోని ఓ ప్రైవేట్ మెడికల్ షాపుపై డ్రగ్ అధికారులు దాడులు చేశారు. దాదాపు రూ.2 లక్షల విలువైన ప్రభుత్వ మందులను స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. వారసిగూడ చౌరస్తాలో మహ్మద్ ముఖీసీద్ అలీ అనే వ్యక్తి రెండు సంవత్సరాల నుంచి హెల్త్ ఫస్ట్ మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆ షాపులో ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసే మందులను విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారంతో డ్రగ్ అధికారులు అసిస్టెంట్ డైరెక్టర్ సరిత, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు గోవిందసింగ్, అనిల్ తదితరులు ఆ మెడికల్ షాపులో తనిఖీలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం లోగోతో పాటు నాట్ ఫర్ సేల్ అని రాసి ఉన్న మందులను భారీగా గుర్తించిన అధికారులు విస్మయం వ్యక్తం చేశారు. ఆ మందుల విలువ దాదాపుగా రూ 2 లక్షల వరకు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. దీంతో హెల్త్ ఫస్ట్ మెడికల్ షాపుపై కేసు నమోదు చేయడంతో పాటు దుకాణాన్ని సీజ్ చేశారు.

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

బన్సీలాల్‌పేట్: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని గాంధీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ రవి కథనం ప్రకారం...బన్సీలాల్‌పేట్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఫయాజ్(30)ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. శుక్రవారం ఉదయం బన్సీలాల్‌పేట్ ప్రాంతంలో ఓ బ్యాగులో గంజాయి పెట్టుకొని విక్రయించడానికి ప్రయత్నిస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. మరో నిందితుడు కె. దినకర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలియజేశారు. నిందితుడు బన్సీలాల్‌పేట్ పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం. డిప్యూటీ కమీషనర్ వెంకటేశ్వర్లు అధ్వర్యంలో ఏసీపీ రవికుమార్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## 3న పద్మశాలీ శంఖారావం

కాచిగూడ: పద్మశాలీ సమాజ సంక్షేమం, అభివృద్ధి, రాజ్యాధికార వాటా సాధనే లక్ష్యంగా ఈనెల 3న ఆదివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న పద్మశాలీ శంఖారావం సభను విజయవంతం చేయాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా పద్మశాలీలందరూ.. కుటుంబ సమేతంగా పాల్గొని ఐక్యతను చాటాలన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని ప్రధాన రాజకీయ పార్టీలను ఆయన డిమాండ్ చేశారు. పద్మశాలీలను విస్మరించిన పార్టీలకు ఓటు ద్వారా గుణపాఠం చెబుతామన్నారు. రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, జాతీయ మహిళా అధ్యక్షురాలు వనం దుశ్యంతల, అవ్వారు భాస్కర్ తదితరులున్నారు.

## 'సంకల్ప' కృషి అభినందనీయం



టీపీసీబీ సభ్యకార్యదర్శి కృష్ణ ఆదిత్యను సన్మానిస్తున్న సంకల్ప అధ్యక్షుడు సుభాష్‌చంద్రబోస్

సనత్‌నగర్: గత 15 సంవత్సరాలుగా పర్యావరణం పరిరక్షణకు విశేష కృషి చేస్తున్న సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్‌ను టీఎస్‌పీసీబీ సభ్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య అభినందించారు. సభ్యకార్యదర్శిని సనత్‌నగర్‌లోని టీఎస్‌పీసీబీ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన సుభాష్‌చంద్రబోస్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సంకల్ప సంస్థ చేపట్టే కార్యక్రమాలను వివరించారు. ఈ నెల 18న ప్రారంభమయ్యే గణేష్ నవరాత్రుల సందర్భంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ వివరాలను సభ్యకార్యదర్శికి వివరించారు. కార్యక్రమంలో సీనియర్ సోషల్ సైంటిస్ట్ డాక్టర్ డబ్ల్యుజీ ప్రసన్నకుమార్, ప్రకృతి సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఆరెపల్లి రాజేంద్రప్రసాద్, పీసీబీప్రాజెక్ట్ ఆఫీసర్ నాగేశ్వరరావు, మీడియా కో-ఆర్డినేటర్ సోమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు మద్దతు తెలపండి



ముస్లిం సోదరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతు దీపక్ జాన్

బౌద్ధనగర్: వారాసిగూడలోని కౌసర్ మసీదును శుక్రవారం సికింద్రాబాద్ కాంగ్రెస్ నేత, ఏఐసీసీ అనలిటిక్స్ జాతీయ కోఆర్డినేటర్ దీపక్ జాన్ సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం మసీదులో ప్రార్థనలు పూర్తి చేసుకొని బయటకు వచ్చిన ముస్లిం మైనార్టీ సోదరుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు యూసుఫ్, సాదిక్, అహ్మద్, మహేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ కార్యాలయంలో రాఖీ వేడుకలు

సికింద్రాబాద్: మధురానగర్‌లోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం రాఖీ పండగ వేడుకలు జరిగాయి. బీజేపీ సికింద్రాబాద్ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి నేతృత్వంలో జరిగిన వేడుకలకు నియోజకవర్గంలోని పలు డివిజన్లకు చెందిన బీజేపీ మహిళా మోర్చా ప్రతినిధులు హాజరై నాయకులు, కార్యకర్తలకు రాఖీలు కట్టారు. అనంతరం మహిళలకు సారంగపాణి చీరలు అందించారు. మేకల కీర్తి, హర్షకిరణ్, భానుమతి, శోభ తదితరులు పాల్గొన్నారు.



మహిళామోర్చా ప్రతినిధులకు చీరలు అందజేస్తున్న మేకల సారంగపాణి

## 'కేంద్రం విధానాల వల్లే ధరల పెరుగుదల'



నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు

ముషీరాబాద్: దేశంలో కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్నంటి పేద ప్రజలపై భారాన్ని మోపాయని సీపీఎం ముషీరాబాద్‌జోన్ కార్యదర్శి దశరథ్ ఆరోపించారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. సీపీఎం ముషీరాబాద్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ముషీరాబాద్ చౌరస్తా, బడీ మసీదు వద్ద నిరసన చేపట్టారు. నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని నినాదాలు చేశారు. ఎం.దశరథ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖలను ప్రైవేటు పరం చేస్తూ.. నిరుద్యోగుల పొట్టకొడుతున్నారని ఆరోపించారు. గతంలో ఇచ్చిన వాగ్ధానాలను ప్రభుత్వం నిర్వహించడం లేదన్నారు. ధరలు తగ్గించని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం హైదరాబాద్ జిల్లా కమిటీ సభ్యులు పద్మ, ముషీరాబాద్ జోన్ నాయకులు శ్రీరాములు, బాబు, పాషా, కృష్ణస్వామి, మోహన్, శేఖర్, ఆంజనేయులు, నరేష్ తదితరులున్నారు.



